క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి ఉద్యోగుల ధర్నా



ధర్నా చేస్తున్న ఉద్యోగులు

మహారాణిపేట : ప్రభుత్వ ఉద్యోగులు, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం కలెక్టరేట్ ఎన్‌జీవో హోమ్ వద్ద పలు శాఖల ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. అమరావతి ఏపీజేఏసీ కమిటీ పిలుపు మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా చైర్మన్ సత్తి నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఇది ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేస్తున్న ధర్నా కాదని, సమస్యల పరిష్కారం కోసం మాత్రమే అన్నారు. ఏపీ రెవెన్యూ సర్వీసెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి కేఎస్ రావు, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్‌కుమార్, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్‌ఏ త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

బోర్డు మూలన పడేసారు



మూలన పడేసిన కెప్టెన్ రామారావు జంక్షన్ బోర్డు

అల్లిపురం: ఒకప్పుడు జీవీఎంసీ ఏర్పాటు చేసిన రహదారి సూచీని ఈపీడీసీఎల్ అండర్ గ్రౌండ్ కేబుల్ సిబ్బంది తొలగించారు. దానిని తిరిగి ఏర్పాటు చేయకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చారిత్రాత్మక వ్యక్తి, అందరికీ ఆదర్శవంతుడిగా, ఈ ప్రాంతంలో ప్రజలకు వైద్యుడిగా పేరుగాంచిన కెప్టెన్ రామారావు పేరు మీద ఏర్పాటు చేసిన రహదారి సూచికను ఇటీవల తొలగించారు. తమ పనులు పూర్తయిన తరువాత బోర్డు ఏర్పాటు చేస్తామని చెప్పిన వారు బోర్డును మూలన పడేయటం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బోర్డును తిరిగి ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

అల్లిపురం రోడ్లకు మరమ్మతులు



అల్లిపురం మెయిన్‌రోడ్డులో మరమ్మతులు చేస్తున్న కార్మికులు

అల్లిపురం: బీఆర్ రెడ్డి జంక్షన్ నుంచి కెప్టెన్ రామారావు జంక్షన్ వరకు గల రోడ్డుకు మరమ్మతులు చేపడుతున్నారు. దీంట్లో భాగంగా శనివారం కంకర, తారుతో రోడ్డును పూడ్చారు. గత రెండు రోజులుగా అస్సాంగార్డెన్స్, నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం రోడ్డు, సౌత్ జైలురోడ్డు, సింహాలదేవిడి ప్రాంతాల్లో మరమ్మతు పనులు చేపట్టారు.

వైభవంగా షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం



సాయిబాబా

దాబాగార్డెన్స్: పాతనగరం బైరాగి మఠంలో గల సౌత్ షిర్డీ సాయిబాబా మందిర 25వ వార్షికోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబాకు మంగళధ్వని వేదమంత్రాలతో ఆలయ అర్చకుడు పూజలు నిర్వహించారు. సన్నిధిలో నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి. వార్షికోత్సవం సందర్భంగా వేలాది మంది భక్తులకు నారాయణ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు జి. సూకేశ్వరరావు, కార్యదర్శి సీహెచ్ కృష్ణమూర్తి, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, డీవీ బాలాజీకుమార్, ఎస్. సోమరాజు, భక్తులు పాల్గొన్నారు.

హమ్మయ్య.. గొంతు తడిసింది

- పూర్ణామార్కెట్ వాసులకు మళ్లీ తాగునీటి సౌకర్యం
- కార్పొరేటర్ చొరవతో నీటి సరఫరా
- వ్యాపారులు, వినియోగదారుల హర్షం

విశాఖ నగరంలో పూర్ణామార్కెట్‌కు ఎనలేని చరిత్ర ఉంది. చాలా ఏళ్ల క్రితం నగరంలోని ఎక్కడి వారైనా టౌన్ అని ఈ ప్రాంతాన్ని సంబోధించేవారు. కాలక్రమేణా తర్వాత నగరం విస్తరించి మిగిలిన ప్రాంతాలు కూడా అభివృద్ధి చెందడంతో పాతనగరాన్ని టౌన్ అనడం తగ్గింది. అయితే ఇప్పటికే టౌన్ కొత్తరోడ్డు అంటూ ఈ పరిసర ప్రాంతాలను పిలుచుకుంటూ ఉంటారు నగరవాసులు. అలాంటి ప్రశస్థమైన పూర్ణామార్కెట్‌కు ప్రతిరోజూ వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. వ్యాపారులు, వినియోగదారులు, సరకు రవాణా చేసే మోటారు కార్మికులు, కలాసీలు ఇక్కడికి వచ్చిపోతూ ఉంటారు. ఈ విధంగా జనం తాకిడి అధికంగా ఉండే పూర్ణామార్కెట్‌లో కొన్నేళ్ల క్రితం మార్వాడీ కమ్యూనిటీకి చెందిన వ్యాపారులు తాగునీటి కుండీని ఏర్పాటు చేశారు. జీవీఎంసీ అధికారులు అందులో మంచినీటిని నింపి మార్కెట్‌కు వచ్చే వారి దాహార్తి తీర్చేవారు. అయితే తర్వాతి కాలంలో దీనిపై అంతా శీతకన్ను వేయడంతో గుక్కెడు నీటి కోసం అంతా ఇబ్బంది పడే పరిస్థితి తలెత్తింది.

జగదాంబ: పూర్ణామార్కెట్‌లో తాగునీటి సౌకర్యం కల్పించడంతో వ్యాపారులు, వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నగరానికే తలమానికమైన పూర్ణామార్కెట్‌లో సుమారు 1500 పైగా దుకాణాలు ఉన్నాయి. అంతే కాకుండా ఇక్కడికి విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి జిల్లాల నుంచి కూడా ప్రజలు నిత్యం వ్యాపార లావాదేవీల నిమిత్తం వస్తుంటారు. వీరందరి సౌకర్యార్థం గతంలో మార్వాడీ కమ్యూనిటీకి చెందిన వ్యాపారులు పూర్ణామార్కెట్ ప్రధాన రహదారి వద్ద కార్ పార్కింగ్ స్థలం వెనుక తాగునీటి కుండీ నిర్మింపజేశారు. జీవీఎంసీ తాగునీటి విభాగం అధికారులు ఎండా కాలం అనే కాకుండా అన్ని కాలల్లోనూ మంచినీటితో ఈ కుండీని నింపేవారు. అలా కొంత కాలం నడిచింది.



పూర్ణామార్కెట్ వద్ద తాగునీటి కుండీ

తర్వాత ఏమైందో తెలియదు కానీ.. జీవీఎంసీ నుండి ఈ కుండీకి నీళ్ల సరఫరా ఆగిపోయింది. దీంతో మళ్లీ తాగునీటి ఇబ్బందులు తలెత్తాయి.

కార్పొరేటర్ చొరవతో..

ప్రజల సౌకర్యార్థం తాగునీటి కుండీలో నీటి సరఫరాకు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు చొరవ తీసుకున్నారు. జీవీఎంసీ తాగునీటి సరఫరా విభాగం అధికారులతో మాట్లాడి కుండీలో నీటి సరఫరాకు చర్యలు తీసుకున్నారు. దీంతో మళ్లీ నీటి సరఫరా యాథావిధిగా జరగడంతో వ్యాపారులు, వివిధ ప్రాంతాల నుంచి మార్కెట్‌కు వచ్చే వినియోగదారులందరికీ గొంతు తడుస్తోంది.

దాహార్తి తీర్చారు..



ఎట్టకేలకు పూర్ణామార్కెట్‌లో నీటిలోటు తీర్చారు. మార్కెట్‌కు వచ్చేటప్పుడే ఇంటి నుండి నీళ్లు తెచ్చుకునే వాళ్లం. ఇప్పుడు మళ్లీ నీటి సరఫరా అవుతుండడంతో ఈ నీళ్లనే వాడుకుంటున్నాం.

–పార్వతమ్మ, పూల వ్యాపారి, పూర్ణామార్కెట్.

నీటి సరఫరా ఆపొద్దు..



కాలం ఏదైనా పూర్ణామార్కెట్‌కు నీటి సరఫరా ఆపొద్దు. ఈ నీటిని మా వ్యాపారులతో పాటు ఈ మార్కెట్‌కు వచ్చే వినియోగదారులు కూడా అవసరానికి వాడుకుంటున్నారు. అన్ని కాలాల్లోను పూర్ణామార్కెట్ నీళ్ల కుండీకి నీరు సరఫరా చేయాలి.

–రామాయమ్మ, వ్యాపారి, పూర్ణామార్కెట్.

బల్లిగిరికి పోటెత్తిన భక్తులు



శ్రీదేవీ, భూదేవీ సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామికి పూజలు చేస్తున్న అర్చకుడు



స్వామి వారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

అల్లిపురం: వైశాఖ మాసం మొదటి శనివారం సందర్భంగా బల్లిగిరి వేంకటేశ్వరమెట్ట దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారు జాము నుంచే స్వామిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఆలయ అర్చకుడు గొడవర్తి రగునాథాచార్యులు స్వామికి శుప్రభాతసేవ, అర్చనలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. పుష్పమాలికలు, తులసి మాలలతో స్వామిని విశేషంగా అలంకరించారు. భక్తులు స్వామికి మామిడి పండ్లను సమర్పించుకున్నారు. ఆలయ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలు ఏర్పాటు చేసి కుల, గోత్ర నామాలతో విశేష అష్టోత్తర పూజా కార్యక్రమం నిర్వహించారు. మే 1వ తేదీ సాయంత్రం 7 గంటలకు స్వామి వారి వార్షిక తిరు కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో రమాబాయి తెలిపారు.

గంగా ఘాట్ వద్ద అన్నదానం



గంగా ఘాట్ వద్ద అన్నదానం, మజ్జిగ పంపిణీ చేస్తున్న వివేకానంద సంస్థ సభ్యులు

దాబాగార్డెన్స్: గంగా పుష్కరాల్లో పాతనగరం స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ చేపడుతున్న అన్నదానం, మజ్జిగ పంపిణీ శనివారం 3వ రోజు కూడా కొనసాగింది. గంగా ఘాట్ వద్ద శనివారం వేలాది మంది భక్తులకు అన్నదాన, మజ్జిగ పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ మిత్రులు (అమెరికాలో ఉంటున్న ప్రవాసభారతీయులు) వంశీ, మణికొండ ఆర్థిక సాయం చేశారని సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు తెలిపారు. యాత్రలో పాల్గొన్న సంస్థ సభ్యుడు చోడిపిల్లి అప్పారావుతో పాటు సహాయ సహకారాలు అందించిన సంఘ సేవకులు వంకాయల సన్యాసిరావు (తాతాజీ), వీవీ రమణమూర్తి, మట్టపల్లి హనుమంతరావు, డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్, ద్రోణంరాజు శ్రీవత్సవ్, గజపతిస్వామి, నల్లరాజు, వి. దానయ్య, తాతబ్బాయి, ఎస్. శ్రీరామ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వైవీ సుబ్బారెడ్డి దృష్టికి వెంకటేశ్వరమెట్ట సమస్య



వైవీ సుబ్బారెడ్డికి సమస్యను వివరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం: వెంకటేశ్వరమెట్ట సమస్యను ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి బొడ్డేటి ప్రసాద్ పార్టీ అల్లూరి, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల కో ఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. శనివారం 30వ వార్డు తాడివీధిలో మహానేత డాక్టర్ వైఎస్. రాజశేఖరరెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయనను వారు మర్యాదపూర్వకంగా కలిసారు. ఆయనకు సమస్యను విపులంగా వివరించారు. దీనిపై అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారని బొడ్డేటి ప్రసాద్ తెలిపారు. ఆయనతో పాటు కోరిబిల్లి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ టీచర్ ట్రైనింగ్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

దాబాగార్డెన్స్: జాతీయ శిశు, మహిళా సంక్షేమ సంస్థ నేషనల్ చైల్డ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (ఎన్‌సీడీసీ) ఆధ్వర్యంలో పిల్లల విద్యలో నూతనంగా ఆన్‌లైన్ టీచర్ ట్రైనింగ్ కోర్సులకు మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఫ్యాకల్టీ సుధా మెనాన్, అడ్మిషన్ కో ఆర్డినేటర్ పద్మ రజని గుడివాడ తెలిపారు. విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 10వ తరగతి నుంచి డిగ్రీ వరకు అర్హత సాధించిన విద్యార్థులకు 5 కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. 10వ తరగతి అర్హతతో ఏడాది పాటు ఇంటర్నేషనల్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్‌లో సర్టిఫికెట్ కోర్సు, ఇంటర్నేషనల్ మాంటిస్సోరి ఎడ్యుకేషనల్ సర్టిఫికెట్ కోర్సుల వివరాలకు 09288026142, 08138000379 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

న్యాయవాది శ్రీనివాస సత్యనారాయణ మృతి



న్యాయవాది శ్రీనివాస సత్యనారాయణ (ఫైల్)

అల్లిపురం: సీనియర్ న్యాయవాది లింగంపల్లి శ్రీనివాస సత్యనారాయణ శనివారం మధ్యాహ్నం మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఎన్‌బీఎం న్యాయకళాశాల పూర్వ విద్యార్థి అయిన ఆయన గత 29 సంవత్సరాలుగా న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్నారు. ఎన్‌బీఎం న్యాయకళాశాల విద్యార్థి నాయకుడిగా, గాజువాక న్యాయవాదుల సంఘం అధ్యక్షునిగా సేవలందించారు. ఆయన ఆకస్మిక మృతి పట్ల జిల్లా ప్రధాన న్యాయమూర్తి గుత్తాల గోపి సంతాపం వ్యక్తం చేశారు. విశాఖ న్యాయవాదుల సంఘం, రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు కె.రామజోగేశ్వరరావు, కౌన్సిల్ సభ్యులు పి.నరసింగరావు, ఎస్.కృష్ణమోహన్, బైపా అరుణ్‌కుమార్, గీతం కళాశాల అధ్యాపకులు ఆచార్య రాఘవయ్య, ఆచార్య అనితారావు, ఎన్‌బీఎం న్యాయకళాశాల అధ్యాపకులు డీవీ రమణ, విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చింతపల్లి రాంబాబు, పైలా శ్రీనివాసరావు, గాజువాక న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కేవీ స్వామి సంతాపం తెలిపారు.

స్కాలర్‌షిప్‌ల జాబితా విడుదల

దాబాగార్డెన్స్: శిష్టకరణ ఫౌండేషన్ ప్రతి ఏటా పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ప్రదానం చేస్తుంది. దీనిలో భాగంగా ఈ ఏడాది ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన 50 మంది శిష్టకరణ విద్యార్థులకు మే 7వ తేదీన స్కాలర్‌షిప్‌లు అందజేయనున్నారు. ఆ జాబితాను శనివారం ఆంధ్రప్రదేశ్ శిష్టకరణ సంక్షేమ, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుమహంతి నాగమణి విడుదల చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాలోని శిష్టకరణాలకు చెందిన విద్యార్థులకు ఈ స్కాలర్‌షిప్‌లు ప్రదానం చేయనున్నట్టు ఆమె తెలిపారు. కార్యక్రమంలో శిష్టకరణ ఫౌండేషన్ అధ్యక్షుడు మానాపురం సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

వివేకానంద ఆశ్రమంలో అన్నదానం

దాబాగార్డెన్స్: సంఘ సేవకుడు ఇరోతి అప్పలనాయుడు నాల్గో వర్ధంతిని పురస్కరించుకుని శనివారం పాతనగరం స్వామి వివేకానంద ఆశ్రమంలో అన్న, వస్త్రదాన కార్యక్రమం నిర్వహించారు. అప్పన్న ధర్మకర్తల మండలి సభ్యుడు గంట్ల శ్రీనుబాబు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు ఈశ్వరరావు, శశి, గంగాధర్, బాలకోటి తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ సంఘాల గుర్తింపును పునరుద్ధరించాలి

దాబాగార్డెన్స్: పోస్టల్ ఉద్యోగ సంఘాలకు కేంద్ర ప్రభుత్వం గుర్తింపు రద్దు చేయడం అప్రజాస్వామికమని అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం (ఏఐఐఈఏ) విశాఖ డివిజన్ అధ్యక్షురాలు ఎం. కామేశ్వరి, ప్రధాన కార్యదర్శి జి. వరప్రసాద్ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఆలిండియా పోస్టల్ ఎంప్లాయీస్ యూనియన్, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయీస్ సంఘాలకు పోస్టల్ శాఖలో 70 శాతం పైబడే సభ్యుల బలం ఉందని, గుర్తింపు రద్దును వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు.

కాలువ సమస్య పరిష్కారానికి చర్యలు



కల్లుపాకలు వీధిలో కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ విల్లూరి

జగదాంబ: ఎట్టకేలకు కల్లుపాకలు వీధిలో దీర్ఘకాలంగా ఉన్న మురుగు కాలువల సమస్య పరిష్కారానికి బీజం పడింది. జీవీఎంసీ 35వ వార్డులో గత కొన్నేళ్లుగా ఈ సమస్యతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావుకు సమస్యపై వీధి ప్రజలందరూ ఫిర్యాదు చేశారు. దీంతో వెంటనే స్పందించిన ఆయన రూ.16 లక్షల వార్డు అభివృద్ధి నిధులు వెచ్చించి కాలువల నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ నాయిని మల్లిబాబు, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితుడికి రూ. 51 వేల ఆర్థిక సాయం



చిట్టిబాబు కుటుంబానికి రూ.51 వేల నగదు అందజేస్తున్న కొండా రాజీవ్‌గాంధీ

మహారాణిపేట : క్యాన్సర్‌తో బాధపడుతున్న 44వ వార్డు పరిధి రాంచంద్రనగర్‌కు చెందిన గూడెపు సింహాచలం అలియాస్ చిట్టిబాబును వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ ఆర్థికంగా ఆదుకున్నారు. శనివారం చిట్టిబాబు కుటుంబానికి రూ.51 వేల ఆర్థిక సహాయం అందించారు. అనంతరం కొండా రాజీవ్ గాంధీ ఉత్తర నియోజకవర్గం కోఆర్డినేటర్ కేకే రాజుతో ఫోన్‌లో మాట్లాడి కుటుంబానికి అండగా ఉండాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారని కొండా తెలిపారు. ఈ కార్యక్రమంలో హరినాథ్‌రెడ్డి, సత్యశివకుమారి, ప్రియా తదితరులు పాల్గొన్నారు.

మహానేత సేవలు చిరస్మరణీయం



దివంగత నేత రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వైవీ సుబ్బారెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే వాసుపల్లి, మేయర్ హరివెంకటకుమారి తదితర నాయకులు

- వైఎస్సార్ విగ్రహావిష్కరణ సభలో పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని సత్కరిస్తున్న పార్టీ శ్రేణులు

మహారాణిపేట : దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి రాష్ట్రానికి చేసిన సేవలు చిరస్మరణీయమని టీటీడీ చైర్మన్, విశాఖ, అనకాపల్లి, విజయనగరం జిల్లాల వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. శనివారం 30వ వార్డు తాడివీధి కమ్యూనిటీ హాలు వద్ద కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం, పెంటపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దివంగత మహానేత, మాజీ ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని సుబ్బారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని అన్నారు. 2024 ఎన్నికల్లో జగనన్నను మరోసారి గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌ను 2024 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకం ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా సీఎం జగన్ పరిపాలన సాగిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ మేయర్ గొలగాని హరివెంకటకుమారి, విశాఖ జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, సౌత్ పరిశీలకుడు వీసం రామకృష్ణ, స్టేట్ క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ జాన్ వెస్లీ, స్టేట్ ఫిషరీస్ చైర్మన్ కోలా గురువులు, రెల్లికుల కార్పొరేషన్ చైర్మన్ వడ్డాది మధుసూదన్‌రావు, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్, పార్టీ స్టేట్ అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ, ద్రోణంరాజు శ్రీవత్సవ్, శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ధర్మకర్తల మండలి చైరపర్సన్ కొల్లి సింహాచలం, సనపల రవీంద్రభరత్, కార్పొరేటర్లు మహ్మద్ సాధిక్, భాస్కరరావు, పద్మావతి, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

దేశ సంపదను కాపాడుకుందాం



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద దీక్షలు చేస్తున్న సీఐటీయూ నాయకులు

సీతమ్మధార : మోడీ ప్రభుత్వం ఆటలు ఇకపై సాగవని, స్టీల్‌ప్లాంట్, ఇతర దేశ సంపదను కాపాడుకుంటామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.జగన్ హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మిక సంఘాలు, ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరుగుతున్న 758వ రోజు దీక్షలకు హాజరైన ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మడానికి మోడీ ప్రభుత్వానికి హక్కు లేదన్నారు. టాటా కంపెనీని బీజేపీ ఉద్దేశ్యపూర్వకంగానే రంగంలోకి తీసుకు వచ్చిందన్నారు. ఎల్‌ఐసీ, రైల్వే, రక్షణ రంగాలకు చెందిన భూములు.. ఇలా దేశం మొత్తాన్ని మోడీ ప్రభుత్వం అమ్మేసే పనిలో ఉందన్నారు. ఇలాంటి ఆటలు సాగనివ్వకుండా ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో మురళి, భాస్కరరావు, పి.దుర్గారావు, జి.శంకర్, ఎండి రాజు, గోవింద్, చిన్నారావు, ముఖేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పేదల కోసం ఉచిత స్వర్గరథం



ఉచిత స్వర్గ రథం ప్రారంభోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైవీ సుబ్బారెడ్డి తదితరులు



నియోజకవర్గ ప్రజల కోసం సిద్ధం చేసిన ఉచిత స్వర్గ రథం

దాబాగార్డెన్స్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు, జీవీఎంసీ 29వ వార్డు మాజీ అధ్యక్షుడు మన్యాల శ్రీనివాస్ దక్షిణ నియోజకవర్గ ప్రజల కోసం ఉచిత స్వర్గ రథం (అంతిమ యాత్ర వాహనం) ఏర్పాటు చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్, ఉమ్మడి విశాఖ, విజయనగరం జిల్లాల ప్రాంతీయ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మే 1న దీనిని ప్రారంభించనున్నారు. అందుకు సంబంధించి శనివారం పార్టీ కార్యాలయంలో వైవీ సుబ్బారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్‌కుమార్, తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్‌ఏ రహ్మాన్ చేతుల మీదుగా కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరింపజేశారు.

బాలల హక్కుల పరిరక్షక నగరంగా విశాఖ



సీపీ త్రివిక్రమ్‌వర్మకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గొండు సీతారాం

దొండపర్తి: అందరి సహకారంతో బాలల హక్కుల పరిరక్షక నగరంగా విశాఖను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సీఎం త్రివిక్రమ్‌వర్మ తెలిపారు. ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం శనివారం సీపీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నగరంలో బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, పోక్సో కేసులు, బాలల అక్రమ రవాణా, విద్యా సంస్థల పరిసరాల్లో మత్తు పదార్థాల సరఫరా వంటి అంశాలపై చర్చించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ పోలీస్ అధికారులు, సిబ్బందితో పాటు వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులకు బాలల హక్కులు, చట్టాలపై సమగ్ర శిక్షణ ఇస్తామన్నారు. బాల్యవివాహాలపై ఎఫ్‌ఐఆర్, పిల్లలతో యాచక వృత్తి చేయిస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని సీతారాం సీపీ కలిసిన వారిలో లవకుశ ఉన్నారు.